
సాక్షి
సంగారెడ్డి
శనివారం : 30 : ఆగస్టు : 2025

హరిత వర్ణం అలంకరణలో గణనాథుడు





పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గణేశ్‌గడ్డ దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం గణేశ్‌గడ్డ దేవస్థానంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించి, స్వామివారిని ఆకుపచ్చవర్ణంలో అలంకరించారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

– పటాన్‌చెరు

న్యూస్‌రీల్

నల్లూర్‌లో నవోదయకు 25 ఎకరాలు: అదనపు కలెక్టర్



స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మాధురి

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం పట్టణ పరిధిలో శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ మాధురి పర్యటించారు. ఈ సందర్భంగా గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని అల్లినగర్ గ్రామం సర్వేనంబర్ 27లో పరిశ్రమల స్థాపనకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం రెవెన్యూ అధికారులతో కలిసి జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని నల్లూరు గ్రామంలోనీ సర్వేనంబర్ 159లో నవోదయ పాఠశాల ఏర్పాటుకు 25 ఎకరాలను కేటాయించారు. పరిశీలన రిపోర్టులను కలెక్టర్‌కు నివేదించనున్నట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు.

త్వరలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ఆస్పత్రి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు పట్టణంలో సుమారు రూ.300 కోట్లతో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని.. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం ఆస్పత్రి అధికారులతో కలిసి నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ...కార్మికులకు అత్యాధునిక వైద్య చికిత్సలతో ఈ ఆస్పత్రిని నిర్మిస్తున్నారన్నారు. తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ నియంత్రణలో 200 పడకలతో ఈ ఆస్పత్రి నిర్వహణ కొనసాగుతుందని తెలిపారు.

ఉత్తీర్ణత పెంచాలి: డీఈఓ



మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి టౌన్: విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని డీఈవో వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. సంగారెడ్డి మండలంలోని కల్పగూర్ ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును, తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు.

వ్యాధులు రాకుండా చర్యలు

జిల్లా కార్మిక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న రవీందర్‌రెడ్డి

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ముందుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కార్మిక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి విద్యార్థులు, ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు న్యాల్‌కల్‌లోని కేజీబీవీ, బీసీ బాలిక వసతి గృహాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వసతి గృహాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. వసతి గృహాలకు వచ్చే రోడ్డు అధ్వానంగా ఉందని దానిని బాగుచేయించాలని, నీటి సమస్యను పరిష్కరించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరారు.

పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలి: టీజీఈ జేఏసీ

సంగారెడ్డి ఎడ్యుకేషన్: వచ్చేనెల 1వ తేదీని పెన్షన్ విద్రోహ దినంగా జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు పాటించాలని టీజీఈ జేఏసీ ఉపాధ్యాయ సంఘాలు పిలుపునిచ్చాయి. అదే రోజు కలెక్టరేట్ ఎదురుగా నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పాల్గొనాలని కోరాయి.

సర్వేలు సరే.. పరిహారం?

ఫసల్ బీమా లేక రైతులకు అందని పరిహారం

- 2018 నుంచి పథకానికి రాష్ట్రం దూరం
- రాష్ట్రం పరిహారంపైనే ఆశలు
- అకాల వర్షాలతో నెలలోనే భారీగా పంట నష్టం



పత్తి పంట చేలో నిలిచిన వర్షపునీరు

నారాయణఖేడ్: ప్రతీ ఏటా కొన్ని పంటలు కోతల సమయాల్లో, మరికొన్ని పంటలు చేతికొచ్చే దశలో అతివృష్టి వర్షాలతో నష్టపోతున్నారు. జిల్లాలో వేలాది ఎకరాలు పంటలు నీటిపాలవుతున్నాయి. పంట నష్టం సంభవించాక అధికారులు అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపిస్తున్నా రైతులకు మాత్రం పరిహారం అందడంలేదు. గత ప్రభుత్వం అవలంభించిన నిర్లక్ష్యాన్నే ఈ ప్రభుత్వమూ కొనసాగిస్తుండటం రైతులపాలిట శాపంగా మారింది. పంట నష్టపోయిన సందర్భాల్లో రైతులకు పరిహారం అందించేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పథకం ఎంతగానో ఉపయోగపడేది. కానీ, తెలంగాణలో ఈ పథకాన్ని అమలు చేయకపోవడంతో రైతులు పంట నష్టపరిహారం అందుకోలేని దుస్థితి నెలకొంది. జిల్లాలో పక్షం రోజుల క్రితం కురిసిన అతివృష్టి వర్షాలకు 2,208 ఎకరాల్లో నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అంచనావేసి ప్రభుత్వానికి నివేదించింది. అయితే మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్టు వారం వ్యవధిలోనే మళ్లీ భారీవర్షాలు జిల్లాను ముంచెత్తాయి. దీంతో మరో 3,596 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని జిల్లా వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా వేసింది. పైన పేర్కొన్న దానికంటే అధికంగానే పంట నష్టం ఉంటుందని రైతులు చెబుతున్నారు.

బీమా లేదు.. ధీమా లేదు

ప్రతీ ఏటా వర్షాలకు దెబ్బతిన్న పంటలకు సంబంధించి అధికారులు సర్వే చేసి నివేదికలు పంపుతున్నారు. గతేడాది సైతం పంపినప్పటికీ ఇంతవరకు పరిహారం అందలేదు. ఉమ్మడి రాష్ట్రంలో ఏటా ఈ పథకం కింద రైతులు లబ్ధి పొందేవారు. కానీ, పథకాన్ని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. ఆ ప్రభుత్వం 2018– 19లో పథకాన్ని నిలిపివేయడంతో వర్షాలతో నష్టపోయిన రైతులకు ధీమా లేకుండా పోయింది. గతంలో పత్తికి వాతావరణ ఆధారిత బీమా, వరి, సోయా పంటలకు గ్రామ యూనిట్‌గా, ఇతర పంటలకు మండలం యూనిట్‌గా పథకాన్ని అమలు చేశారు. అతివృష్టి, అనావృష్టి సమయాల్లో నష్టపోయిన పంటలకు ఈ పథకం ద్వారా పరిహారం అందించేవారు. బీమా ప్రీమియంలో రైతులు 50% చెల్లిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 25% చొప్పున చెల్లించేది. కానీ, పథకాన్ని కొన్నేళ్లుగా అమలు చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫసల్ బీమా పథకం అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించినప్పటికీ ఇంకా కార్యరూపం దాల్చలేదు. వర్షాల వల్ల పంట నష్టం జరిగితే రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతులకు పరిహారం అందడం గాలిలో దీపంలానే మారింది. ఫసల్ బీమా ఉంటే రైతులకు ఇలాంటి సమయాల్లో ప్రయోజనకరంగా ఉండేదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఏటా నష్టాల పాలవుతున్నాం



ప్రభుత్వాలు మారుతున్నా పంటలకు ఫసల్ బీమా చేయకపోవడంతో అకాల, అతివృష్టి వర్షాలకు ఏటా పంటలు నష్ట పోతున్నాం. ప్రభుత్వాలు పంటల బీమా చేయడంలో విఫలం చెందడంతో మాకు ఈ తిప్పలు తప్పడం లేదు. అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తే ప్రస్తుతం మేము నష్టపోయిన పెసర, పత్తి, సోయా పంటలకు బీమా పొందే అవకాశం ఉండేది. గత, ప్రస్తుత ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరితో మాకు నష్టాలు తప్పడం లేదు.

– దార్కు బాల్‌కిషన్, దామర్‌గిద్దా, కంగ్టి మండలం(రైతు)

కదం తొక్కిన కార్మికులు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

- కలెక్టరేట్ గేట్లు ఎక్కి ఆందోళన
- సీఐటీయూ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాణిక్యం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కార్మిక హక్కుల కోసం కాంట్రాక్ట్ కార్మికులు సంగారెడ్డిలో కదం తొక్కారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కాంటాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ 26 వేలు చెల్లించాలని, చట్ట బద్ధమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సంగారెడ్డిలో కాంట్రాక్ట్ కార్మికులు తమ హక్కుల కోసం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చిన కార్మికులు లోపలికి వెళ్లేందుకు గేట్లు ఎక్కారు. కార్మికుల సమస్యలపై స్పందించాలని నినాదాలు చేయడంతో కలెక్టరేట్ ఏవో,కార్మిక శాఖ ఏఎల్‌ఓ అధికారులు బయటకు వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. అనంతరం సీఐటీయూ కాంట్రాక్ట్ వర్కర్స్‌యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాణిక్యం మాట్లాడుతూ... నిత్యవసర సరుకుల ధరలు పెరుగుతున్నా కార్మికుల కనీస వేతనాలు మాత్రం పెరగడం లేదన్నారు. కార్మికుల పట్ల నిర్లక్ష్యం తగదని ప్రభుత్వాలను హెచ్చరించారు. 15 ఏళ్లకుపైగా కనీస వేతనాలను సవరించకపోవడం దారుణమన్నారు. అర్హులైన కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య, జిల్లా సహాయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా నిమజ్జన ఏర్పాట్లు

ఎమ్మెల్యే మాణిక్‌రావు



నారింజ ప్రాజెక్టు వద్ద పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు తదితరులు

జహీరాబాద్/జహీరాబాద్ టౌన్: వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కె.మాణిక్‌రావు, రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని కొత్తూర్(బి) గ్రామ శివారులోని నారింజ ప్రాజెక్టును వారు అధికారులతో కలిసి సందర్శించారు. నారింజ వద్ద నిమజ్జనం కోసం చేయాల్సిన ఏర్పాట్లను అధికారులకు వివరించారు. ప్రాజెక్టు వరకు ఉన్న రోడ్లను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేయాలని ఆదేశించారు. అంతకుముందు పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు ఝరాసంగం మండలంలోని బొప్పన్‌పల్లికి చెందిన సిద్దప్పకు రూ.15 వేల సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. జహీరాబాద్ పట్టణంలోని అతిథిలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాన్ని గురువారం రాత్రి ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్ సందర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

పరిహారం అందేలా కృషి చేస్తా

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



కమలాపూర్ చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్: వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం నుంచి ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. నాగల్‌గిద్ద మండలం గౌడ్‌గాం జన్‌వాడ, మంజీరా నది పరీవాహకంగా గ్రామాల వ్యవసాయ క్షేత్రాలను ఎమ్మెల్యే సంజీవరెడ్డి శుక్రవారం పర్యటించి పరిశీలించారు. రైతులు, గ్రామాల ప్రజల పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖేడ్‌లోని శాఖా గ్రంథాలయాన్ని సందర్శించి పాఠకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అధికారులు జరిగిన పంటలు, ఆస్తుల నష్టంను అంచనా వేసి ప్రభుత్వానికి వెంటనే నివేదిక పంపించాలని సూచించారు. మనూరు మండలంలోని కమలాపూర్ చెరువు పరిశీలించి చెరువు వద్ద చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశించారు. చెరువు దుస్థితిని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు.

రెస్క్యూటీం సేవలు సద్వినియోగం చేసుకోండి

వర్షాల నేపథ్యంలో సహాయంకోసం టోల్ ఫ్రీ నంబరు 101కు లేదా అగ్నిమాపక కేంద్రానికి సంబంధించి 8712699393, 8712699392 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రాకపోకల పునరుద్ధరణ

నారాయణఖేడ్: ఖేడ్- సిర్గాపూర్ మార్గంలో ఖేడ్ మండలంలోని చల్లగిద్ద తండా వద్ద రోడ్డు వర్షాలకు కోతకు గురవ్వడంతో కామారెడ్డి జిల్లాకు రాకపోకలు నిలిచిపోయాయి. మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆదేశించడంతో శుక్రవారం ఉదయం జేసీబీతో మరమ్మతు పనులు చేపట్టి సాయంత్రానికి పూర్తి చేశారు. దీంతో రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి.

జహీరాబాద్ ఇన్‌చార్జి ఆర్డీఓగా డెవూజా

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ఇన్‌చార్జి ఆర్డీఓగా జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి డెవూజా శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఆర్డీఓగా ఉన్న రాంరెడ్డి దీర్ఘకాలం సెలవుపై వెళ్లగా..ఆయన స్థానంలో డెవూజాను నియమించారు. బాధ్యతలను స్వీకరించిన అనంతరం ఆయన వరద ప్రాంతాల్లో పర్యటించారు. నారింజ ప్రాజెక్టును సందర్శించి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు.

సింగూరుకు భారీ వరద

ఆరు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. రెండు రోజులుగా కురిసిన వర్షపునీరు డ్యామ్‌లోకి చేరుతోంది. దీంతో 5,6,9,8,10,11 నంబర్ గల ఆరు గేట్లను రెండు మీటర్ల పైకి ఎత్తి దిగువకు 60,920 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. కాగా, ప్రాజెక్టులో 19 టీఎంసీల నీటిని ఉంచి మిగతా నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులోకి 53,075 ఇన్‌ఫ్లో రాగా..ఔట్‌ఫ్లో 60,920 క్యూసెక్కులని అధికారులు తెలిపారు.



16 రోజులుగా ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయం జల దిగ్బంధంలోనే ఉంది. దీంతో రాజగోపురంలో ఉత్సవ విగ్రహానికి పూజలు చేస్తున్నారు.

– పాపన్నపేట

విద్యతోపాటు క్రీడలూ ముఖ్యం

- కలెక్టర్ ప్రావీణ్య, ఎంపీ రఘునందన్
- ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



హాకీ క్రీడల ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి జోన్/సంగారెడ్డి: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలూ ఎంతో ముఖ్యమని కలెక్టర్ ప్రావీణ్య, ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. సంగారెడ్డిలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన హాకీపోటీలను ఇద్దరూ జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు మండల కేంద్రమైన చౌటకూర్‌లో పర్యటించి గ్రామంలోని బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...అన్ని రంగాల్లో ఆడపిల్లలను ప్రోత్సహించాలన్నారు. విద్యార్థి జీవితంలో క్రీడలు ఒక భాగంగా చేసుకోవాలని, క్రమశిక్షణ, మానసిక ఎదుగుదలకు క్రీడలు బలమైన పునాది వేస్తాయన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాల లభ్యత, డిజిటల్ బోధన విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, యువజన క్రీడా శాఖ జిల్లా అధికారి ఖాసీం బేగ్, ఒలింపిక్స్ అసోసియేషన్ కార్యదర్శి చంద్రశేఖర్, వివిధ క్రీడాకారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో గ్రామపంచాయతీ ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్‌లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో విజయవంతం చేసేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు.

రైతులకు అండగా ఉంటా

ఎంపీ రఘునందన్‌రావు



ఎంపీ రఘునందన్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్/సదాశివపేట(సంగారెడ్డి): భూములు కోల్పోయిన రైతులకు అండగా ఉంటానని ఎంపీ రఘునందన్‌రావు స్పష్టం చేశారు. భూమిని కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ సంగారెడ్డి బీజేపీ నాయకులు శుక్రవారం రఘునందన్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు భూములు కోల్పోయిన రైతులకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...గతంలో ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి తొగర్‌పల్లి రైతుల దగ్గర భూమిని తీసుకుందన్నారు. ఆ రైతులకు పరిహారంతోపాటు ఇళ్ల స్థలాలు కూడా ఇస్తామని చెప్పి పదేళ్లు గడిచినా నేటికీ ఇవ్వలేదని చెప్పారు. కొన్ని రోజుల క్రితం వచ్చి కార్పొరేట్ సంస్థకు మాత్రం ప్రభుత్వం వెంటనే భూమిని మంజూరు చేసిందని గుర్తు చేశారు. ప్రభుత్వం స్పందించి త్వరలోనే రైతులందరికీ ఇళ్ల స్థలాలిచ్చి న్యాయం చేయాలని లేదంటే రైతులందరితో కలిసి ధర్నా నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇళ్ల స్థలం ఇప్పించేవరకు రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీనిచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు మల్లేశం, మండల ప్రధాన కార్యదర్శి శివ, నాయకులు కిషన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి

చదువుకున్న యువత ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా మరో పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని సుభాష్‌రోడ్డులో నూతన సాయిగణేశ్‌వస్త్రషాపింగ్ మాల్‌ను ఆయన ప్రారంభించారు.

మార్కండేయ ఆలయాభివృద్ధికి కృషి



పాలకమండలి సభ్యుల ప్రమాణస్వీకారోత్సవంలో నిర్మలారెడ్డి

టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి

సదాశివపేట(సంగారెడ్డి): ఈశ్వర మార్కండేయ ఆలయాభివృద్ధికి తన వంతు పూర్తి సహాయ సహకారం అందిస్తానని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఈశ్వర మార్కండేయ ఆలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార మహోత్సవానికి శుక్రవారం ఆమె హాజరై మాట్లాడారు. మార్కండేయ మందిరంలో నిర్మలారెడ్డితోపాటు నూతన పాలకమండలి చైర్మన్, సభ్యులు ప్రత్యేక పూజలు చేసి మార్కండేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో దేవాదాయ శాఖ ఈఓ రామారావు నూతన పాలకమండలి చైర్మన్‌గా వెంకన్న, డైరెక్టర్లుగా సి.మాణిక్యం, ఎం.రామకృష్ణ, కె.హరికృష్ణ, ఎం.అనితతో ప్రమాణ స్వీకారం చేయించారు.

జహీరాబాద్ చెక్‌పోస్టు ఎత్తివేత!

- సరిహద్దు ఆర్టీఏ చెక్‌పోస్టుల ఎత్తివేతకు ప్రభుత్వం నిర్ణయం
- త్వరలో మూసివేసేందుకు కార్యాచరణ
- తీరనున్న వాహనదారుల ఇబ్బందులు



రాష్ట్ర సరిహద్దులో ఉన్న రవాణశాఖ చెక్‌పోస్టు

జహీరాబాద్: రాష్ట్ర సరిహద్దులోని 65వ జాతీయ రహదారిపై జహీరాబాద్ వద్ద ఉన్న రవాణ శాఖ చెక్‌పోస్టును త్వరలో ఎత్తివేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెక్‌పోస్టులను ఎత్తివేయనున్నందున అందులోభాగంగా జహీరాబాద్ నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలం మాడ్గి వద్ద చెక్‌పోస్టు త్వరలో మూతపడనుంది. చెక్‌పోస్టులను ఎత్తివేస్తూ రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ గురువారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జహీరాబాద్ చెక్‌పోస్టు సైతం ఎత్తివేయనున్నారు. దీంతో జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్న జహీరాబాద్, కామారెడ్డి, మద్నూర్ రవాణా శాఖ చెక్‌పోస్టులను ఎత్తివేయనున్నారు. రవాణ సరుకు వాహనాలకు ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి సులభంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఆర్టీఏ సరిహద్దు చెక్‌పోస్టులను ఎత్తివేశారు. ఇంతకు ముందు రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చెక్‌పోస్టుల ఎత్తివేతకు సానుకూలంగా లేనందునే ఎత్తివేసే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకుంది. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉండటంతో చెక్‌పోస్టుల ఎత్తివేతకు మార్గం సుగమం అయింది. దేశ వ్యాప్తంగా జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత రవాణ పర్మిట్లు, ఇతర అనుమతులన్నీ ఆన్‌లైన్‌లోనే లభిస్తున్నాయి. దీంతో అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న రవాణ శాఖ చెక్‌పోస్టులు అవసరం లేదని కేంద్రం 2021లో ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సరిహద్దు చెక్‌పోస్టులను ఇప్పటికే తీసివేశారు. మిగతా రాష్ట్రాల్లో చెక్‌పోస్టుల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. అందులో భాగంగానే రాష్ట్రంలో కూడ చెక్‌పోస్టులను తొలగించేందుకు నిర్ణయించారు.

ఆయా శాఖల్లో తీరనున్న సిబ్బంది కొరత

చెక్‌పోస్టులను తొలగించడం వల్ల లారీ యజమానులు, ఇతర వాహనాల యజమానులకు ఊరట లభించనుంది. ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి వచ్చే వాహనాలు, వాటి పర్మిట్లు చెక్‌పోస్టుల్లో తనిఖీ చేయించుకోవాలి. పర్మిట్లతోపాటు అన్నీ అనుమతులు ఉన్నప్పటికీ వాహనం చెక్‌పోస్టు దాటాలన్నా ఎంతో కొంత ముట్టుజెప్పుకోక తప్పదనే అభిప్రాయాలను వాహనదారులు వ్యక్తం చేస్తున్నారు. చెక్‌పోస్టుల్లో పనిచేసే సిబ్బందిని ఇతర శాఖలకు మార్చడం ద్వారా ఆయా శాఖల్లో కొంతమేర సిబ్బంది కొరత కూడా తీరనుంది. చెక్‌పోస్టులను మూసివేయడం వల్ల జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య కూడా తీరుతుందనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక నిఘా

పన్నులు ఎగవేసే వాహనాలపై ప్రత్యేక నిఘా వేయనున్నారు. చెక్‌పోస్టులు పూర్తిగా తొలగించినా వాటి స్థానంలో ఆరు నెలల పాటు మొబైల్ స్క్వాడ్‌లు పనిచేయనున్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా వేయనున్నారు. వాహనాలు రాష్ట్రంలోకి ప్రవేశించగానే వాహనాల నంబర్లను కెమెరాలు స్కాన్ చేస్తాయి. డాక్యుమెంట్ లేని వాహనాలను మాత్రం చెక్‌పోస్టు వద్ద నిలిపి వేస్తారు. అనంతరం వాటికి ఫైన్ విధించి వదిలిపెడతారు. రెండు మూడు నెలల్లో కెమెరాల బిగింపు ప్రక్రియ పూర్తి అయ్యే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

క్లుప్తంగా

వ్యక్తిగత ఫొటోలు షేర్ చేయొద్దు

సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు షేర్ చేసే ముందు ఆలోచించాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్ నేరగాళ్లు డబ్బును దోచుకోవడమే కాకుండా... వ్యక్తిగత డేటాను సోషల్ మీడియా అకౌంట్ల ద్వారా దొంగిలిస్తారని, జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థులు ఫేస్ బుక్, వాట్సప్, ఈ-మెయిల్ తోపాటు ఇతర సోషల్ మీడియా ద్వారా వచ్చే లింకులను క్లిక్ చేయొద్దని తెలిపారు. అలాగే ఆన్‌లైన్‌లో గేమ్స్, యాప్‌లను డౌన్‌లోడ్ చేయకూడదని సూచించారు. ఏదైనా సైబర్ క్రైమ్ జరిగితే వెంటనే 1930కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి(గ్రేడ్-4) శైలేష్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ హైమావతి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. తిమ్మాపూర్‌లో పారిశుధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించాడని, దీంతో గ్రామంలో ఇద్దరు డెంగీతో మరణించారు. ఈ నేపథ్యంలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా శైలేష్ సస్పెన్షన్ కావడంతో అనంతసాగర్ కార్యదర్శిని తిమ్మాపూర్‌కు ఇన్‌చార్జిగా నియమిస్తూ ఎంపీడీఓ రాంరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

గల్లంతైన యాదాగౌడ్ మృతదేహం లభ్యం

హవేళిఘణాపూర్(మెదక్): వినాయక చవితి సందర్భంగా మెదక్ వెళ్లి వస్తుండగా ఇద్దరు వ్యక్తులు వరద ఉధృతిలో కొట్టుకుపోయారు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఆటోలో వస్తుండగా రాజ్‌పేట వాగు వద్ద వరద ఉధృతిలో కొట్టుకుపోయిన వారిలో దామరంచ యాదాగౌడ్(38) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. మరో వ్యక్తి బెస్త సత్యనారాయణ మృతదేహం గురువారం లభ్యమైంది. ఎన్‌డీఆర్ఎఫ్ బృందం సభ్యులు డ్రోన్ కెమెరాలతో వెతకగా ఆటోకు వంద మీటర్ల దూరంలో ఉన్న నీటిలో శవం ఉన్నట్లు గుర్తించి బయటకు తీశారు.

మృతుడి కుటుంబాలకు ఎమ్మెల్యే సాయం

వరదలో కొట్టుకుపోయి మృతి చెందిన వారి రెండు కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఆర్థిక సాయం చేస్తామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ప్రకటించారు. ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబానికి అన్ని విధాలా ఆదుకొని చేయూతనిస్తామని తెలిపారు.

మనస్తాపంతో మంజీరాలో దూకిన వ్యక్తి

ఆచూకీ కోసం గాలింపు


మల్లేశం

సంగారెడ్డి : పలు ఇబ్బందులతో వ్యక్తి పారుతున్న మంజీరా నదిలో దూకాడు. ఈ ఘటన శుక్రవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. జిల్లాలోని ఉమ్మడి పుల్కల్ మండలంలోని శివంపేట గ్రామానికి చెందిన బదంపేట మల్లేశం గౌడ్ (50) బ్రిడ్జిపై నుంచి నదిలోకి దూకాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పుల్కల్ పోలీసులు ఘటనాస్థలానికి వచ్చి నది వద్ద గాలింపు చర్యలు చేపట్టేసరికి చీకటి కావడంతో నిలిపివేశారు. తిరిగి శనివారం గాలింపు చర్యలు చేపట్టనున్నారు. మల్లేశం నదిలో దూకే దృశ్యం సీసీ కెమెరాలో రికార్డు అయింది.

కంట్రోల్‌రూంపై అవగాహన కరువు

మూడు రోజుల్లో 28 కాల్స్ మాత్రమే..

మెదక్ కలెక్టరేట్: వరదల నుంచి తక్షణ సాయం అందించేందుకు మెదక్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూంను ప్రజలు అంతంత మాత్రమే సద్వినియోగం చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 31 సెంటి మీటర్ల వర్షం కురిసింది. వర్షానికి రోడ్లు, కట్టలు తెగిపోయి, వాగులు, వంకలు, చెరువులు పొంగి పొర్లాయి. అయితే గురువారం రాత్రి మెదక్ మండలంలోని గుట్టకిందిపల్లి గ్రామానికి చెందిన మహేశ్ తన భార్య గర్భిణి కావడంతో ఇబ్బందులు పడుతున్నామని ఫోన్ చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. కంట్రోల్‌రూంకు పాపన్నపేట, హవేళిఘణాపూర్ మండలాల నుంచి కాల్స్ వచ్చినట్లు అధికారులు తెలిపారు.

పొలాల్లో ఇసుక మేటలు

నార్సింగి జాతీయ రహదారి పక్కన ఉన్న గన్నేరు వాగుకు వరద పోటెత్తడంతో పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. దీంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మరో వైపు వరద నీటిలో వందల ఎకరాల్లో పంటలు నీటమునిగి రైతులకు నష్టం జరిగింది. మండలంలోని పలు గ్రామాల్లో వాగుల పక్కన ఉన్న పొల్లాలో వరద ఇప్పటికీ కొనసాగుతోంది. –చిన్నశంకరంపేట(మెదక్)


నార్సింగి జాతీయ రహదారి పక్కన పంటపొలంలో ఏర్పడిన ఇసుక మేటలు

జల దిగ్బంధంలో సదాశివనగర్


వరదలకు కొట్టుకుపోయిన తండాకు వచ్చే రోడ్డు


కాలినడకన చెరువులోనుంచి వస్తున్న తండావాసులు

- ఇబ్బందులు పడుతున్న తండావాసులు
- ఇతర ప్రాంతాలతో సంబంధాలు కట్
- అత్యవసరమైతే అటవీ ద్వారా కాలినడకే దిక్కు

రామాయంపేట(మెదక్): మండలంలోని సదాశివనగర్ తండా జలదిగ్బంధంలో చిక్కుకుంది. మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో తండాకు ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి. రెండు వైపులా ఉన్న దారిలో ఐదు చోట్ల రోడ్డు తెగిపోగా, మధ్యలో ఉన్న చెరువు అలుగు పారుతుండటంతో తండావాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు ఇలా.. ఝాన్సిలింగాపూర్ పంచాయతీ పరిధిలో ఉన్న సదాశివనగర్ తండాలో 25 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. మొత్తం జనాభా 180కి ఉంది. ఈ తండాకు ఝాన్సిలింగాపూర్, అక్కన్నపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి అటవీ ప్రాంతం గుండా వేర్వేరుగా రెండు దారులు న్నాయి. భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి తండాకు నాలుగైదు రోజులపాటు రాకపోకలు స్తంభిస్తాయి. దీంతో ప్రతి ఏటా గిరిజనులకు కాలినడకే శరణ్యంగా మారింది. తాజాగా కురిసిన భారీ వర్షంతో ఎక్కడిక్కడ రోడ్లు తెగిపోయాయి. ఈసారి వరద తీవ్రత అధికంగా ఉండటంతో అక్కన్నపేట వైపు మూడు చోట్ల, ఝాన్సిలింగాపూర్ వైపు రెండు చోట్ల రోడ్డు తెగిపోయింది. తండా సమీపంలో ఉన్న చెరువు అలుగు పారుతుండటంతో వెళ్లడానికి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. దీంతో గిరిజనులు చెరువు నీటిలోనుంచి, అటవీప్రాంతం గుండా కాలినడకన వస్తున్నారు. తండా రహదారి మరమ్మతు గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని గిరిజనులు వాపోయారు. వెంటనే రోడ్డుకు మరమ్మతులు విజ్ఞప్తి చేశారు. నీటి పారుదలశాఖ ఏఈ సూర్యకాంత్ చెరువు అలుగును, రోడ్డును పరిశీలించారు.

తండాలో ఉండలేకపోతున్నాం



అటవీ ప్రాంతంలో ఉంటున్న మాకు సరైన రోడ్డు సదుపాయం లేదు. వర్షాలు పడితే పరిస్థితి దారుణం. అత్యవసరంగా ఎక్కడికైనా వెళ్లాలంటే కాలినడకన అటవీ ప్రాంతం ద్వారానే వెళ్లాల్సి వస్తుంది. తండాలో ఉండాలంటే మస్తు కష్టమైతుంది.

– కమల, తండా మహిళ

తారు రోడ్డు నిర్మించాలి



గతంలో తండా మీదుగా ఝాన్సిలింగాపూర్‌కు డాంబర్ రోడ్డు మంజూరైనా నిర్మించలేదు. దీంతో తమకు మట్టి రోడ్డే దిక్కయింది. వర్షం పడినప్పుడల్లా ఈ రోడ్డు కొట్టుకుపోతుంది. ప్రతిసారి మాకు ఇబ్బందులు తప్ప డం లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– జమున, తండా మహిళ

కోతకు గురైన రోడ్లు


నిజాంపేట , చల్మెడ గ్రామాల మధ్య ప్రవహిస్తున్న వరదనీరు

- ఇబ్బందులు పడిన ప్రజలు
- నస్కల్, రాంపూర్, నందగోకుల్ గ్రామాలకు ప్రమాద హెచ్చరిక
- వేయి ఎకరాల్లో పంట నష్టం

నిజాంపేట (మెదక్): మండలంలోని చల్మెడ, నస్కల్ గ్రామాలకు వెళ్లే రహదారులు కోతకు గురయ్యాయి. కామారెడ్డి జిల్లాకు వెళ్లే రహదారులు పూర్తిగా శిథిలం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిజాంపేట మల్కా చెరువు పొంగి పొర్లడంతో నిజాంపేట, నస్కల్ మధ్యలో బ్రిడ్జి ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో నిజాంపేట నుంచి నస్కల్, రాంపూర్, నందగోకుల్ గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. అలాగే నిజాంపేట, చల్మెడ గ్రామాల మధ్య సోమయ్య చెరువు, బ్రహ్మణ చెరువు పొంగి పొర్లడంతో రెండు గ్రామాల మధ్య బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరాయి. కామారెడ్డి జిల్లా బీబీపేట పెద్ద చెరువుకు రెండు సార్లు బుంగ పడటంతో నీటి ప్రవాహం అధికమైంది. దీంతో నిజాంపేట మండలంలోని నస్కల్, రాంపూర్ గ్రామాలకు ఎస్‌డీఆర్ఎఫ్ బలగాలు గ్రామాలకు చేరుకొని రాత్రి నుంచి ముంపు ప్రాంతాల్లో ఉన్న వారిని సుమారు 400 మందిని ప్రభుత్వ పాఠశాలకు చేర్చారు. ప్రస్తుతం బీబీపేట చెరువు గండి పూడ్చడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వాతావరణ శాఖ మళ్లీ భారీ వర్షం ఉందని చెప్పిన నేపథ్యంలో అధికార, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, 25 గ్రామాల ప్రజలను అలర్ట్ చేశారు. నిజాంపేట మండలంలో సుమారు వెయ్యి ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది.

తగ్గని వరద.. వీడని వాన


కూలిన ఇల్లు


నీట మునిగిన పంటను పరిశీలిస్తున్న రైతులు

- జలదిగ్బంధంలోనే వన దుర్గమ్మ
- ఎల్లాపూర్.. భారాఖాన వద్ద రాకపోకలకు సుగమం
- మండలంలో 2450 ఎకరాల్లో పంట నష్టం
- కూలిన 29 ఇళ్లు

పాపన్నపేట(మెదక్): వర్షాలతో మంజీరాలోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. ఘనపురం ఆనకట్ట నుంచి శుక్రవారం 59,800 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. దీంతో ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయం జల దిగ్బంధంలోనే ఉంది. 16 రోజులుగా అమ్మవారి ఆలయం భక్తులు వెళ్లడానికి వీలు లేకపోవడంతో, రాజగోపురంలో ఉత్సవ విగ్రహాన్ని ఉంచి పూజలు చేస్తున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని 2450 ఎకరాల వరి పంట నీట మునిగింది. 2935 రైతులు పంటను కోల్పోయారు. అలాగే మండలంలో 29 ఇళ్లు కూలిపోయాయి. ఎల్లాపూర్ బ్రిడ్జిపై, భారాఖానల వద్ద మంజీరా నీటి ప్రవాహం తగ్గడంతో, ముందుకు వెళ్లేందుకు పోలీసులు అనుమతించారు. దీంతో మండల వాసులు మెదక్ వెళ్లడానికి మార్గం సుగమం అయ్యింది. ఎమ్మార్వో సతీశ్ ఆధ్వర్యంలో రెవెన్యు సిబ్బంది, రాజ్యాతండా రోడ్డు, కూలిన ఇళ్లను పరిశీలించారు. మండలంలో సుమారు 29 ఇళ్లు కూలిపోయినట్లు తెలిపారు. వ్యవసాయ అధికారి నాగమాధురి మండలంలోని పలు గ్రామాల్లో నీట మునిగిన పంటలను పరిశీలించారు. ముఖ్యంగా మంజీరా తీర ప్రాంతాల్లో పంట ఎక్కువగా మునిగినట్లు తెలిపారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న హల్దీవాగు

- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- ధ్వంసమైన కాజ్‌వే


తూప్రాన్-కిష్టాపూర్ రహదారిపై ఉప్పొంగి ప్రవహిస్తున్న హల్దీవాగుతో నిలిచిన రాకపోకలు

తూప్రాన్: భారీ వర్షాలకు చెరువులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని కిష్టాపూర్, గుండ్రెడ్డిపల్లి గ్రామాలకు వెళ్లాల్సిన ప్రధాన రహదారి హల్దీవాగుపై నిర్మించిన కాజ్‌వే పైనుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఫలితంగా కిష్టాపూర్, వెంకటాయిపల్లి, నర్సంపల్లి, గుండ్రెడ్డిపల్లి, గౌడిగుడెం, దాతర్‌పల్లి, మల్కాపూర్, కోనాయిపల్లి(పీబీ) గ్రామాలతో పాటు ఇతర దౌల్తాబాద్, వర్గల్ మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు సుమారు 15 కిలోమీటర్ల తిరిగి వెళుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. తూప్రాన్ పెద్ద చెరువు అలుగు నుంచి భారీగా నీరు వెళుతుండటంతో చెరువు కట్టపైకి వెళ్లాల్సిన దారి నీటి ప్రవాహానికి కోతలు ఏర్పడి భారీ గుంతలు ఏర్పడ్డాయి.

పొలానికి వెళ్లాలంటే తిప్పలే..


వాగు ఉధృతితో పొలాలకు వెళ్లలేకపోతున్నామని నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

- 14 కి.మీటర్లు తిరిగి వెళ్లాల్సిందే
- భాగీర్థిపల్లిలో బ్రిడ్జి లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు

చిన్నశంకరంపేట(మెదక్): వాగు ఉధృతంగా ప్రవహించడంతో పంట పొలాలు నీటమునిగాయి. మండలంలోని భాగీర్థిపల్లిలో శుక్రవారం గ్రామ రైతులు వాగు అవతల ఉన్న పంట పొలాలకు వెళ్లలేకపోతున్నామని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వాగును దాటలేని పరిస్థితి ఉందని, దీంతో చిన్నశంకరంపేట మీదుగా గవ్వలపల్లి నుంచి జంగరాయి తండా మీదుగా పంట పొలాలకు సుమారు 14 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తుందన్నారు. వర్షాలకు పైన ఉన్న చిన్న శంకరంపేట, గవ్వలపల్లి, జంగరాయి, సూరారం గ్రామాల చెరువులు అలుగుపారడంతో బంద్ అయ్యే వరకు తిప్పలు తప్పడం లేదని వాపోతున్నారు. తాము పంట పొలాలకు వెళ్లేలా బ్రిడ్జి నిర్మాణం కోసం అధికారులు సహకరించాలని రైతులు కోరుతున్నారు.

టెండర్ల ద్వారా మల్లన్నకు రూ.3.43కోట్లు

గతేడాది కంటే రూ.99 లక్షలు అధికం


స్వామి వారి రాజగోపురం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకునే భక్తుల సంఖ్య ప్రతి సంవత్సరం అంతకంతకూ పెరుగుతోంది. అదే రీతిలో ఆలయంలో నిర్వహించే పలు అంశాలకు సంబంధించి నిర్వహించే బహిరంగ వేలం, సీల్డ్ టెండర్లు, ఆన్‌లైన్ టెండర్ల ద్వారా స్వామి వారికి ఆదాయం సమకూరింది. ఇటీవల ఈ సంవత్సరానికి టెండర్లు నిర్వహించారు. ఆలయంలో కొబ్బరి ముక్కల సేకరణ ద్వారా రూ.71,77,777, ఒడిబియ్యం, వస్త్రాలు, పసుపు సేకరణ ద్వారా రూ.70. 56లక్షలు, చెప్పుల స్టాండ్ ద్వారా రూ.15 లక్షలు, కొబ్బరికాయల విక్రయం ద్వారా రూ.45లక్షల 50వేల 115, ఎల్లమ్మ ఆలయం ఒడిబియ్యం సేకరణ ద్వారా రూ.18.30 లక్షల ఆదాయం వచ్చింది. కోరమీసాల ద్వారా రూ.16.61లక్షలు, తలనీలాల ద్వారా రూ.1,01, 01,116, సులభ్ కాంప్లెక్స్ నిర్వహణ ద్వారా రూ.4.71వేలు రాగా మొత్తం రూ.3కోట్ల 43లక్షల 47,009 ఆదాయం సమకూరింది. గతేడాది టెండర్ల ద్వారా రూ.2లక్షల 44వేల 28వేలు సమకూరింది. గతంతో పోలిస్తే ప్రస్తుతం రూ.99లక్షల 19,009 అధిక ఆదాయం వచ్చింది. పెరిగిన ఆదాయంతో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఆలయ ఈఓ అన్నపూర్ణ తెలిపారు.

డెంగీతో బాలుడు మృతి


యశ్వంత్

జగదేవ్‌పూర్(గజ్వేల్): తీవ్ర జ్వరంతో బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని అనంత సాగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన బొనగిరి కిష్టయ్య, రూప దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు యశ్వంత్(10) కుకునూర్ పల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. నాలుగు రోజుల నుంచి అతడు జ్వరంతో బాధపడుతున్నాడు. దీంతో అక్కడే ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించారు. జ్వరం తగ్గకపోవడంతో గురువారం గజ్వేల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి డెంగీ లక్షణాలు ఉన్నట్లు నిర్ధారించారు. వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందాడు. కాగా గ్రామంలో 15 మంది విష జ్వరాల బారిన పడ్డారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాస్ గ్రామానికి చేరుకుని బాలుడి కుటుంబాన్ని పరామర్శించారు.

ప్రేమ పెళ్లి వద్దన్నందుకు..

- యువకుడు ఆత్మహత్య
- సిద్దిపేట జిల్లాలో ఘటన


శివసాయి

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రేమ పెళ్లి వద్దన్నందుకు యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని ఇబ్రహీంనగర్‌లో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన పొన్నాల శివసాయి(19)కి తల్లి ఎల్లవ్వ, సోదరి భవిత ఉన్నారు. తల్లీకొడుకు కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. సోదరి నర్స్ ట్రైనింగ్ చేస్తుంది. తండ్రి మల్లేశం రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా శివసాయి ఒక అమ్మాయిని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని తల్లికి చెప్పాడు. కూలీ పనులు చేస్తేనే కుటుంబం గడుస్తుందని, ఇప్పుడు పెళ్లి వద్దని, తరుచూ ఫోన్ మాట్లాడవద్దని మందలించింది. దీంతో ఇంటి పక్కనే ఉన్న రేకుల షెడ్‌లో ఉరేసుకున్నాడు. ఇది గమనించిన తల్లి ఇతరుల సాయంతో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

జీవితంపై విరక్తి చెంది..

బెజ్జంకి(సిద్దిపేట): జీవితంపై విరక్తి చెంది యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ కథనం మేరకు... ఎల్లంపల్లె గ్రామానికి చెందిన సంగెం చంద్రవ్వ కుమారుడు రాజేందర్(25)తో కలిసి జీవిస్తుంది. శుక్రవారం ఉదయం చక్కెర తెస్తానని వెళ్లాడు. డిగ్రీ పూర్తి చేసిన రాజేందర్ ఉద్యోగం, ఉపాధి అవకాశాలు రాకపోవడంతో ఖాళీగా ఉంటున్నాడు. పెళ్లి సంబంధాలు రావడం లేదు. దీంతో మనస్తాపం చెంది బెజ్జంకి వైకుంఠధామం సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకున్నాడు.

ఇంటర్ విద్యార్థిని..


అనూష

హత్నూర(సంగారెడ్డి): క్షణికావేశంలో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని కొన్యాలలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీధర్ రెడ్డి వివరాల ప్రకారం... పుల్కల్ మండలం ఎస్ ఇటిక్యాల గ్రామానికి చెందిన మిన్పూరి మల్లేశం కూతురు మిన్పూరి అనూష అలియాస్ వడ్డేపల్లి అనూష (16) కొన్నేళ్లుగా కొన్యాలలో అమ్మమ్మ వడ్డేపల్లి మల్లమ్మ దగ్గర ఉంటుంది. మండలంలోని గుండ్లమాచ్నూర్ శివారులోని ఆదర్శ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతుంది. రోజు మాదిరిగానే ఆమె శుక్రవారం ఉదయం కళాశాలకు వెళ్లడానికి గ్రామంలోని బస్టాండ్ వద్ద నిలుచుంది. అదే సమయంలో అమ్మమ్మ అటువైపు వెళుతూ చేతిలో టిఫిన్ బాక్స్ కనిపించకపోవడంతో మీ నాన్నకు చెబుతానని అనడంతో అనూష తిరిగి ఇంటికి వెళ్లింది. క్షణికావేశంలో ఇంట్లోని దూలానికి చున్నీతో ఉరేసుకుంది. అమ్మమ్మ వచ్చి చూసేసరికి ఉరి వేసుకుని కనిపించడంతో అనూష తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చింది. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాముకాటుతో వ్యక్తి మృతి


రఘురాములు

చేగుంట(తూప్రాన్): పాముకాటుకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన చౌదరి రఘురాములు(49) ఈనెల 24న వ్యవసాయ పొలం వద్దకు వెళ్లగా పాముకాటుకు గురయ్యాడు. గ్రామస్తులు స్థానిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రఘురాములు శుక్రవారం మృతి చెందాడు.

పిచ్చి కుక్క దాడిలో గేదె మృతి

కల్హేర్(నారాయణఖేడ్): పిచ్చి కుక్క దాడిలో గేదె మృతి చెందింది. మార్డి గ్రామానికి చెందిన కుమ్మరి వెంకయ్యకు చెందిన గేదెను పిచ్చి కుక్క కరిచింది. దీంతో తీవ్రంగా గాయపడి మరణించింది. రూ.లక్ష విలువైన గేదె మరణించిందని, కాగా ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు. కుక్కల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

దుబాయ్‌కు వలసెళ్లి.. నానా కష్టాలు

- పాస్‌పోర్ట్, వీసా పోగొట్టుకున్న బాధితుడు
- 13 ఏళ్లుగా అక్కడే
- దాత సాయంతో సొంత గ్రామానికి


దుబాయ్‌లో టికెట్ ఇప్పించి ఇండియాకు పంపిస్తున్న దాత హన్మంతరెడ్డి సోదరులు

వెల్దుర్తి(తూప్రాన్): బతుకు దెరువు కోసం దుబాయ్‌కు వలసెళ్లి దురదృష్టవశాత్తు తన పాస్‌పోర్ట్‌ను పోగొట్టుకొని అదృశ్యమయ్యాడు. 9 ఏళ్లగా అతని వద్ద నుంచి కుటుంబసభ్యులకు ఎలాంటి సమాచారం అందకపోవడంతో బతికున్నాడో..లేడో తెలియని పరిస్థితి. ఇలాంటి తరుణంలో ఓ దాత సహకారంతో సొంత ఊరికి చేరుకోవడంతో కుటుంబంలో సంతోషం వెల్లివిరిసింది. వివరాలు ఇలా... మండలంలోని ఉప్పులింగాపూర్ గ్రామానికి చెందిన కొనింటి కృష్ణ, లక్ష్మి భార్యాభర్తలు. వీరికి ఒక కూతురు, కుమారుడు రాజు ఉన్నారు. కుటుంబ పోషణ నిమిత్తం కృష్ణ సుమారు 13 ఏళ్ల క్రితం దుబాయ్‌కు వలస వెళ్లాడు. నాలుగేళ్ల పాటు సజావుగానే ఉన్నా ఉన్నట్టుండి పాస్‌పోర్ట్, వీసా ఇతర పత్రాలు పోగొట్టుకున్నాడు. దీంతో ఎక్కడ ఉన్నాడు, ఎవరి వద్ద పనిచేస్తున్నాడు.. తొమ్మిదేళ్లగా కుటుంబానికి తెలియని పరిస్థితి. ఈ క్రమంలో దుబాయ్‌లో కృష్ణ భిక్షాటన చేస్తుండగా కామారెడ్డి జిల్లాకు చెందిన హన్మంతరెడ్డి అక్కడ గమనించి ఆరా తీశాడు. ఉప్పులింగాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి ద్వారా పూర్తి వివరాలు తెలుసుకున్నాడు. చేతిలో చిల్లి గవ్వ లేకపోవడం పాస్‌పోర్ట్, వీసా పరిమితి గడువు ముగియడం, వాటిని ఎక్కడో పారేసుకోవడంతో ఇంటికి రాలేకపోయాడు. నెలరోజుల్లో కృష్ణకు అవసరమైన పాస్‌పోర్టు, వీసా, ఇతర పత్రాలను హన్మంతరెడ్డి స్వయంగా దుబాయ్‌లో సమకూర్చి టికెట్ ఖర్చులు సుమారు రూ.లక్షన్నర వరకు చెల్లించి భారత్‌కు పంపించాడు. శుక్రవారం తన స్వగ్రామానికి చేరుకోగా భార్య లక్ష్మి, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. సొంత గ్రామానికి చేరుకోవడానికి సహకరించిన దాత హన్మంతరెడ్డికి గ్రామస్తులు, కృష్ణ, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.